క్లుప్తంగా

ఘనంగా సహస్ర సువాసినీ పూజ



ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి రోజా

రామచంద్రాపురం: రాయలచెరువు సమీపంలోని శ్రీశక్తిపీఠంలో శుక్రవారం సహస్ర సువాసినీ పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు చీర, పసుపు, కుంకుమ అందజేశారు. కార్యక్రమంలో మంత్రి ఆర్‌కే రోజా పాల్గొని పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీస్వామి, మాతాజీ రమ్యానంద భారతి ఆశీర్వచనాలు పొందారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పరమ పవిత్రమైన శ్రీశక్తిపీఠాన్ని స్థాపించి లోక క్షేమం కోసం యాగాలు, క్రతువులు నిర్వహించడం అభినందనీయమన్నారు. పీఠం నిర్వాహకులు శ్రీకాంత్, సాయికుమార్ పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

తిరుపతి అర్బన్: జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయంలో శుక్రవారం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు నూతన సంవత్సర డైరీ ఆవిష్కరించారు. ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం భాస్కర్, పీఓ పార్థసారధి, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోషియేషన్ నాయకులు జేఎంఆర్ నాయుడు, శేషాద్రి, ఆర్‌ఎస్ రాజు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో మంత్రి

తిరుచానూరు: శ్రీపద్మావతి అమ్మవారిని శుక్రవారం దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేద ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

న్యాయవాది మృతికి సంతాపం

తిరుపతి లీగల్: నగరంలోని 3వ అదనపు జిల్లా జడ్జి కోర్టు హాల్‌లో న్యాయవాది కె.ప్రియాంక మృతికి సంతాప సభను శుక్రవారం నిర్వహించారు. అదనపు జిల్లా జడ్జి వై.వీర్రాజు, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు దినకర్, పలువురు న్యాయవాదులు ప్రసంగించారు. సభలో న్యాయమూర్తులు అన్వర్‌బాషా, నాగరాజు, శ్రీనివాసరావు, శిరీష, పవన్‌కుమార్, సరిత, శ్రీనివాస్, న్యాయవాద కార్యవర్గ సభ్యులు మురళీమోహన్, హరినాథనాయుడు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం పనుల పరిశీలన

తిరుపతి తుడా: నగరంలోని ఇందిరా మైదానంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులను కమిషనర్ అనుపమ అంజలి శుక్రవారం పరిశీలించారు. నత్తనడకన నిర్మాణ పనులు సాగుతుండడంపై మండిపడ్డారు. సకాలంలో నిర్మించకుంటే బిల్లులు నిలిపివేస్తామని హెచ్చరించారు. కమిషనర్ మాట్లాడతుఞ స్మార్ట్ సిటీ నిధులతో షటిల్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, జిమ్నాయిజం కోర్టులు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఏయికామ్ సంస్థ బాలాజీ, అనిల్ పాల్గొన్నారు.

రూ.33లక్షలతో బస్టాండ్ అభివృద్ధి

పాకాల: ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రూ.33లక్షలు మంజూరు చేయించినట్లు వైఎస్సార్‌సీపీ పాకాల డివిజన్ అధ్యక్షుడు నంగా కపిలేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను ఎమ్మెల్యే చెవిరెడ్డి నెరవేరుస్తున్నారన్నారు. ప్రస్తుతం సిమెంట్ ఫ్లాట్‌ఫామ్ నిర్మిస్తున్నామని, ఇతర అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బాలశంకర్, విశ్వనాథరెడ్డి, నాగరాజా, సునీల్ పాల్గొన్నారు.

అర్హులందరికీ 'సంక్షేమం'

- పేదల అభ్యున్నతే లక్ష్యం
- ఎప్పటికప్పుడు ప్రజా సమస్యల పరిష్కారం
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే భూమన



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

తిరుపతి మంగళం: పార్టీలకు అతీతంగా.. పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని 8వ డివిజన్ ఎర్రమిట్ట, మద్దిమానువీధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందించారు. స్థానిక సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే దిశానిర్దేశం చేస్తున్నారని కొనియాడారు. అనంతరం పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. ఏళ్ల తరబడి అద్దె ఇంట్లో అవస్థలు పడుతున్న తమకు జగనన్న సొంతిల్లు అందించారని వసంతమ్మ అనే మహిళ ఆనందం వ్యక్తం చేశారు. జగనన్న అమలు చేస్తున్న అమ్మఒడి నగదులో తమ బిడ్డను ఉన్నతంగా చదివించుకుంటున్నామని జయలక్ష్మి అనే లబ్ధిదారు కృతజ్ఞతలు తెలిపారు. జగనన్న అందించిన చేయూత డబ్బులతో చిన్నపాటి వ్యాపారం చేసుకుంటూ గౌరవంగా జీవనం సాగిస్తున్నామని ప్రసన్న అనే చిరువ్యాపారి సంతోషం వెలిబుచ్చారు. ఇలా ప్రతి ఇంటి గడపలోనూ ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తుండడంపై ఎమ్మెల్యే ధన్యవాదాలు చెప్పారు. దేశంలో ఏ నాయకుడు అందించలేని స్థాయిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలు ప్రజల ఇంటి ముంగిటకే చేరుస్తున్నారన్నారు. జగనన్న అధికారంలో ఉంటేనే పేదలకు పథకాలు అందుతాయనే విషయం ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు మురళి, కార్పొరేటర్లు మునిరామిరెడ్డి, రామస్వామి వెంకటేశ్వర్లు, వరికుంట్ల నారాయణ, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ ఖాసిం, నాయకులు రవిచంద్ర, గఫూర్, మురళి, పుల్లయ్య, నాధముని, కంకణాల రమేష్ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

తిరుపతి తుడా : కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా సకల వసతులు సమకూరుస్తున్నామని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్లకు దుస్తులు, నూనె, చెప్పులు, సోపులతో కూడిన కిట్‌లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న 1,392 మంది పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్లు ఒక్కొక్కరికి రూ.3,100ల విలువైన వస్తువులతో కూడిన కిట్‌లను మొత్తం రూ.43 లక్షలు వెచ్చించి అందిస్తున్నామన్నారు. ఏటా సంక్రాంతి సందర్భంగా కార్మికులకు కానుక ఇవ్వడం సంతోషంగా ఉందని వెల్లడించారు. కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ నగర పరిశుభ్రతకు అహర్నిశలు కృషి చేస్తున్న కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, అదనపు కమిషనర్ సునీత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, ఆర్‌ఓ కేఎల్ వర్మ, మేనేజర్ చిట్టిబాబు, డీఈ విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సీబీఎస్‌ఈ ఓ వరం

- డీఈఓ శేఖర్

తిరుపతి ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు సీబీఎస్‌ఈ ఓ వరమని తిరుపతి డీఈఓ డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. తిరుపతిలోని అకార్డ్ పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. డీఈఓ మాట్లాడుతూ విద్యారంగాన్ని, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, అమలు చేస్తున్నారని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా విద్యార్థులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్‌ఈని ప్రవేశపెట్టనున్నారని, ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి పాఠశాలలను ఎంపిక చేయగా తిరుపతి జిల్లాలో 43 పాఠశాలలు ఎంపికై నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే తొలివిడతగా 30 సీబీఎస్‌ఈ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీనియర్ ఎస్‌ఏలకు అఫిలియేషన్ సిస్టమ్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, అకడమిక్స్ ట్రైనింగ్, సాధారణ పరిపాలనాంశాలు, సీబీఎస్‌ఈ పరీక్షల నిర్వహణ, స్కిల్ ఎడ్యుకేషన్, ప్రాంతీయ కార్యాలయాధికారి పర్యవేక్షణ అనే అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. సీబీఎస్‌ఈ వ్యవస్థను ఈ శిక్షణ ద్వారా అర్థం చేసుకుని ఆయా పాఠశాలల్లో పటిష్టంగా అమలు చేసి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు పల్లె సింధు, తులసి జ్యోతి, జనార్దనరెడ్డి, టీవీ సుబ్రమణ్యం, సర్వశిక్షా ఏఎంఓ శివశంకర్, అసిస్టెంట్ ఏఎంఓ మధు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లపై సమీక్ష

తిరుపతి అర్బన్: నగరంలోని పేదలకు కేటాయించిన జగనన్న ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై కలెక్టర్ వెంకటరమణారెడ్డి శుక్రవారం సమీక్షించారు. ఎం.కొత్తపల్లె, చిందేపల్లె, సూరప్పకశం, కల్లూరు, జీపాళెంలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాల దశలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి, ఆర్డీఓ కనకనరసారెడ్డి, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, ఈఈ చంద్రశేఖర్‌బాబు, తహసీల్దార్లు వెంకటరమణ, ఉదయసంతోష్, శివప్రసాద్, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాస్‌లో రక్తదాన శిబిరం

తిరుపతి కల్చరల్: గుత్తా ముని రత్నం జయంతిని పురస్కరించుకుని శుక్రవారం తిరుపతి రాస్ భవనంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మునిరత్నం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి మునిరత్నం విశేషంగా కృషి చేశారన్నారు. శిబిరంలో 150 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రాస్ సంయుక్త కార్యదర్శి మమత, డైరెక్టర్ వి.నాగరాజు, యువరాజ్, మోహన్, భాను, కవిత, నాగమణి, నందిని పాల్గొన్నారు.

ఆస్పత్రిలో విజిలెన్స్ తనిఖీ

చంద్రగిరి: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. వైద్యుల హాజరు పట్టిక, సిటిజన్ చార్ట్‌ను పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణలో పారిశుద్ధ్య నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విజిలెన్స్ డీఈ నాగసురేష్ మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. విధులకు సకాలంలో హాజరుకావాలన్నారు. రోగులకు పంపిణీ చేసిన మందుల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలేని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జియాలజిస్ట్ ధనుంజయ, ఎస్‌ఐ రామకృష్ణ నాయక్, ఇన్‌చార్జి డాక్టర్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

గరుడునిపై గోవిందుడు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారు శుక్రవారం రాత్రి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజామున స్వామి వారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలను సమర్పించారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో ప్రభుత్వ విప్ జగ్గారెడ్డి, ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రరావు, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, నిర్మాత ఏక్తా కపూర్ ఉన్నారు.

30 నుంచి రచనాభాస్యంపై శిక్షణ

తిరుచానూరు: ఎస్వీయూలో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 3 తేదీ వరకు 'తెలుగులో పరీక్ష, మూల్యాంకనం, ప్రశ్నాంశ రచనాభ్యాసం' అనే అంశంపై శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు తెలుగు అధ్యయన శాఖ అధ్యక్షురాలు ఆచార్య ఆర్.రాజేశ్వరమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఎస్వీయూలోని జీఎన్ రెడ్డి సెమినార్‌హాల్లో కార్యక్రమం జరుగుతుందన్నారు.

నిందితుడికి రిమాండ్

తిరుపతి లీగల్: లారీని అపహరించిన కేసులో కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌కు చెందిన అనిల్‌కుమార్‌కు ఈనెల 20వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. రేణిగుంట అర్బన్ సీఐ వెంకటరెడ్డి, ఎస్‌ఐ ఈశ్వరయ్య నిందితుడిని అరెస్టు చేశారు.

27 మందికి జరిమానా

తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడపడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి నేరాలకు పాల్పడిన 27 మందికి రూ.38,400లు జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ సుబ్బలక్ష్మి శుక్రవారం తీర్పు చెప్పారు.

ఫుట్‌పాత్ నిర్మాణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న పోకల అశోక్‌కుమార్

తిరుపతి కల్చరల్: ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీనివాస సముదాయం వద్ద ఫుట్‌పాత్ నిర్మాణ పనులను శుక్రవారం టీటీడీ పాలక మండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరగా ఫుట్ పాత్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

కల్యాణ వెంకన్న సేవలో తెలంగాణ ఎంపీ

తిరుపతి రూరల్: తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వర స్వామివారిని శుక్రవారం తెలంగాణ ఎంపీ దామోదరరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, లక్ష్మీ దంపతులు స్వయంగా దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

తిరుపతి ఎడ్యుకేషన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ పాలిటెక్నిక్ మైదానంలో 25వ అంతర్ పాలిటెక్నిక్ క్రీడా పోటీలను శుక్రవారం ప్రారంభించారు. మేయర్ శిరీష ,సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీ ఏ.నిర్మల్‌కుమార్ ప్రియా, ప్రిన్సిపల్ ద్వారకనాథ్‌రెడ్డి, పీడీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

11న అండర్–19 అథ్లెటిక్స్ ఎంపికలు

తిరుపతి ఎడ్యుకేషన్: ఎస్వీ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్–19 అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎస్.జయరామయ్య మాట్లాడుతూ ఆసక్తిగల విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్, స్టడీ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను తీసుకురావాలని కోరారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి

భాకరాపేట: మండలంలోని జంగావాండ్లపల్లె పంచాయతీ, చినిగేపల్లె గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో సీడీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రవీంద్రనాథరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని కలిసి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బాలిరెడ్డి భారతరెడ్డితోపాటు పలువురు కార్యకర్తలకు ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు వెల్లడించారు.

ఉర్రూతలూగించిన యువజనోత్సవం

తిరుచానూరు: శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో నిర్వహిస్తున్న యువజనోత్సవ పోటీల్లో శుక్రవారం విద్యార్థుల జానపద నృత్యాలు ఉర్రూతలూగించాయి. కన్నడ, హిందూస్థాని సంగీతాలాపన ప్రత్యేకంగా ఆకట్టుకుంది. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ నుంచి వారి సంస్కృతి, సంప్రదాయాల్లో గిరిజన నృత్యాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించి అలరింపజేశారు. యువజనోత్సవాలు శనివారంతో ఘనంగా ముగియనున్నాయి. ఉత్తమ ప్రతిభ చాటిన బృందాలకు బహుమతులు అందజేయనున్నారు.

రేపు మహతిలో కళా ప్రదర్శన

తిరుపతి కల్చరల్: టీటీడీ సౌజన్యంతో మన సంస్కృతి కళా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రాచీన జానపద, సంప్రదాయ కళారూపాలు, భక్తి, భజన పాటల కళా ప్రదర్శన ఉంటుందని ఆ సంస్థ అధ్యక్షుడు సహదేవనాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన మాడుతూ సంక్రాంతి సందర్భంగా ఈ కళా ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. సంస్థ గౌరవాధ్యక్షుడు గంగిరెడ్డి, కార్యదర్శి రెడ్డెప్ప పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మృతులకి నివాళి



నివాళులర్పిస్తున్న ఎంపీపీ మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రమేష్ పిళ్లై, దేవయాని దంపతులకు భౌతికకాయాలకు ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నివాళులర్పించారు. శుక్రవారం తిరుపతి రూరల్ మండలం చిగురువాడలోని రమేష్ నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను ఓదార్చారు. వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యురాలిగా దేవయాని విశేష సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రదీప్ రెడ్డి, ఉప సర్పంచ్ మోహన్ రామిరెడ్డి ఉన్నారు.

మాజీ సీజేఐను కలిసిన న్యాయవాదులు

తిరుపతి లీగల్: సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణను తిరుపతి న్యాయవాదులు శుక్రవారం రేణిగుంట విమానాశ్రయం వద్ద కలిసి శాలువతో సన్మానించారు. తిరుపతి న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు దినకర్, ఉపాధ్యక్షుడు మురళీమోహన్, ప్రధాన కార్యదర్శి హరినాథనాయుడు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్‌గా రాజేంద్ర

రామచంద్రాపురం: మండలంలోని నెత్తకుప్పం గ్రామానికి చెందిన రాజేంద్ర శుక్రవారం తిరుపతి జిల్లా ఎమ్మార్పీఎస్ కన్వీనర్‌గా నియమితులయ్యారు.